## 9

# క్రీస్తు: మార్గములో (భక్తిలో) మన అధికారి

యేసు క్రీస్తు యొక్క ప్రతిరూపము విషయంలో ప్రజలు ఇష్టపడు దాని గూర్చి వారు కాస్త నిర్హేతుకంగా ఉంటున్నారు. కొందరు "కోమలమైన" ప్రతిరూపములను కరచిపట్టుకొన్నట్లుగా ఉంటారు: శిష్యుల పాదములు కడుగుట, చిన్నపిల్లలను ఆశీర్వదించుట, పాపములు క్షమించుట, పాపులతో కలిసి భోజనము చేయుట మొదలగునవి. ఇతరులు క్రీస్తు యొక్క "ఆశ్చర్యకరమైన" ప్రతిరూపములను పట్టుకొని వ్రేలాడుచుందురు: నీళ్ల మీద నడుచుట, తుఫానును నిమ్మళింపజేయుట, ఐదు రొట్టెలు ఐదు వేల ప్రజలకు సరిపడునట్లు ఆశీర్వదించుట, మృతులలో నుండి పునరుత్థానుడగుట మొదలగునవి. తరుచుగా, విశ్వాసులు యేసు గూర్చిన ఒక కథలోని సన్నివేశమును ఎంపిక చేసికొని, "యేసు క్రీస్తు యొక్క ఈ పటమును నేను నా కొరకు ఉంచుకొంటాను" అని చెప్పుచున్నట్లు అగుపించుచున్నది.

ఏదిఏమైనా, మనము నిజముగా యేసునందు విశ్వసించుచున్నట్లయితే, ఆయన గూర్చి సువార్తలు తెలియజెప్పు సమస్త సత్యములను మనము విశ్వసించవలెను. ఆయన సువార్తలు బోధించుచున్న ప్రకారము ఏదైనా అయియుండినట్లయితే, ఆయన ఏమేమి అయియున్నాడని అవి బోధించుచున్నవో అవన్నీ అయియుండును. ఆయన కేవలము మృదువైనవాడు మరియు కోమలమైన బోధకుడు గాక దానిని మించినవాడై యుండెను, మరియు ఆయన ఆశ్చర్యజనకమైన కార్యములు మాత్రమే గాక వాటిని మించిన కార్యములను సహితము చేసాడు.

మార్గము విషయములో యేసు మన అధికారియై యున్నాడని క్రొత్త నిబంధన స్పష్టముగా తెలుపుచున్నది. 'కొండ మీద ప్రసంగము' ముగింపులో "జనసమూహములో ఆయన బోధకి ఆశ్చర్యపడుచుండిరి; ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక, అధికారముగలవానివలె, వారికిబోధించెను" అని వ్రాయబడి యుండుట మనము చూడగలము (మత్తయి 7:28, 29). ఆయన ఆరోహణమునకు కొద్ది గడియల క్రితం, ఆయన, "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" అని చెప్పాడు (మత్తయి 28:18). ఆయన ఆరోహణమైన పిదప, పెంతెకొస్తు దినాన, "... యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" అని పేతురు ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 2:36). దేవుడు యేసును "ప్రభువు"గా నియమించాడు, మరియు "ప్రభువు" అనగా "పరిపాలకుడు" లేక "యాజమాని" అని అర్థం. యేసు గూర్చి క్రొత్త నిబంధనలో తరుచుగా "ప్రభువు" అని చెప్పబడుచుండును (1 పేతురు 3:15; రోమీయులకు 10:9, 10; ఫిలిప్పీయులకు 2:9–11 చూడుము). ఇంతేగాక, ఆయన రాజ్యమునకు ఆయన రాజై యున్నాడు (యోహాను 18:37). వాస్తవమునకు, ఆయన, "రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై" యున్నాడు (1 తిమోతి 6:15).

యేసు ఆయనకుగల అధికారమును అనేక విధాలుగా ప్రదర్శించాడు. *ఆయన అధికారముగలవానివలె మాటలాడాడు.* ఆయన ధర్మశాస్త్రములకు అర్థవివరణ

నిచ్చుచుండినప్పుడు రబ్బీలను ఉల్లేఖించి చెప్పలేదు. దానికి బదులుగా, "... అని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా ..." అని చెప్పుట ద్వారా, ధర్మశాస్త్రము గూర్చి సాధారణంగా విశ్వసింపబడిన విషయమును సూచించిన పిదప, "నేను మీతో చెప్పునదేమనగా ..." అని ఆయన చాటిచెప్పాడు (మత్తయి 5:27, 38, 43). ఈ విధంగా, ఆయన బోధలు సాధికారమైనవని యేసు అంతఃసూచన చేయుచు అది ఏ అంశమైనను దాని తుది వాక్కు ఆయనదే అని సలహా చెప్పాడు. సరికదా *ఆయన చేసిన కార్యములన్నిటిని అధికారముతో చేసాడు.* దేవాలయములో నుండి "రూకలు అమ్మువారిని" వెళ్లగొట్టుటకు ఆయన ఎవరి అనుమతినైనను కోరలేదు, కానీ తన సొంత అధికారముతో ఆ పని చేసాడు. ఆయన చేసిన అద్భుతములు ద్వారా, యేసు సమస్త సృష్టిజాలముపై ఆయనకు గల శక్తిని ప్రదర్శించాడు. ఆయన తుఫానును నిమ్మళింపజేసిన తరువాత, ఆయన శిష్యులు "ఆశ్చర్యపడి, ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవి" అని చెప్పుకొన్నారు (మత్తయి 8:27).

యేసు అధికారమును ప్రభావమునుగలవాడై యుండెను – "సర్వాధికారము" గలవాడు! మన మార్గము విషయములో ఆయనకు ఎటువంటి అధికారమున్నది?

## తన సంఘమును నిర్దేశించు సర్వాధికారము

మొదటిదిగా, యేసు తన సంఘమును నిర్దేశించగల సర్వాధికారము కలిగియున్నాడు. సంఘము ఆయన శరీరమై యున్నది (కొలొస్సయులకు 1:18), మరియు ఆయన సంఘమునకు శిరస్సైయున్నాడు (ఎఫెసీయులకు 1:22, 23). సంఘము ఇహమందు క్రీస్తు యొక్క రాజ్యము కూడ (మత్తయి 16:18, 19; కొలొస్సయులకు 1:13, 14), మరియు ఆయన రాజై యున్నాడు. సంఘమునకు ఆయన శిరస్సై యున్నందున, సంఘ సభ్యులు ఆయన అధికారము క్రింద ఉందురు (ఎఫెసీయులకు 5:24); ఆయన రాజ్యములోని పౌరులు ఆయన పరిపాలనకు లోబడవలసినవారై యున్నారు.

ఆచరణాత్మక దృష్టికోణంలో చూచినట్లయితే, యేసునకు సంఘముపై సర్వాధికారమున్నది అనగా అర్థమేమిటి? క్రైస్తవులు ఆయన చిత్తమును కనుగొనుచు దానిప్రకారము చేయవలసియున్నదని అది శాసించుచున్నది. సంఘము దేనిని పోలినదై యుండవలెను? అది ఏమని పిలువబడవలెను? సంఘము ఉపదేశించవలసిన విషయములేమైయున్నవి? అది ఎలా వ్యవస్థీకరింపబడవలెను? సంఘము దేవునిని ఎలా ఆరాధించవలెను? ఈ ప్రశ్నలకును యింకేమైనా ఉంటే ఆ ప్రశ్నలన్నిటికిని సమాధానములు మరొక్క ప్రశ్నను అడుగుట ద్వారా కనుగొనగలము: "యేసు, సంఘమునకు శిరస్సైయున్నవాడు, ఈ విషయంలో ఏమని చెప్పుచున్నాడు?"

ఎవరైనా ఒకరు వారి ఆక్షేపణను తెలుపవచ్చును: "యేసు ఇహమందుండినప్పుడు ఆ సంగతులన్నిటిని ఆయన సంబోధింపలేదు." అనేక విషయాల్లో ఇది సత్యమే అయియుండగా, క్రొత్త నిబంధనను అధ్యయనము చేయుట ద్వారా క్రీస్తు చిత్తము నిర్ధారింపబడవచ్చును.

పౌలు, పేతురు, మరియు ఇతరులు రచించిన విషయాలు క్రీస్తు చిత్త ప్రకారమైనవని మనమెలా రూఢిపర్చుకొనగలము? వారు వెళ్లి ఆయన యొక్క అధికారముతో ప్రకటింపవలెనని యేసు తన అపొస్తలులను నియామకము చేసాడు (మత్తయి 28:18–20).

దీనికి అదనంగా, వారిని సర్వ సత్యములోనికి నడిపించుటకు ఆయన పరిశుద్ధాత్మను పంపించాడు (యోహాను 16:13), వారికి అనుగ్రహింపబడు ప్రేరేపణ చొప్పున అపొస్తలులు మాటలాడునట్లు సమర్థవంతులనుగా ఆయన చేయును (అపొస్తలుల కార్యములు 2:4). అపొస్తలులు మరియు క్రొత్త నిబంధన ఇతర గ్రంథకర్తలు చెప్పినది మరియు రచించినవి "దేవునివాక్కు"గా పరిగణింపబడవలెను (1 థెస్సలొనీకయులకు 2:13; 2 తిమోతి 3:16, 17; 2 పేతురు 3:15, 16 చూడుము). కాబట్టి, క్రొత్త నిబంధన క్రీస్తు వాక్యమై యున్నది, పరిశుద్ధాత్మ చేత బయలుపర్చబడినది మరియు ప్రేరేపింపబడినవారి చేత లిఖింపబడినది. సువార్తలలో గల యేసు వాక్కులు ఎంత సాధికరమైనవై యున్నవో క్రొత్త నిబంధన అంతా కూడా అంతే సాధికారమైనవై యున్నది.

ఒకరు ఈ పరిస్థితిని దృష్టించగల ఒక విధానమేమనగా దీనంతటిని ఒక గొలుసుకట్టు ఆజ్ఞగా పరిగణించవలెను. దేవునికి అధికారముండినది; ఆయన క్రీస్తునకు సర్వాధికారమిచ్చాడు; అటుతరువాత క్రీస్తు అట్టి అధికారమును అపొస్తలులకిచ్చాడు; అపొస్తలులు సాధికారంగా మాటలాడారు మరియు గ్రంథస్థం చేసారు. కాబట్టి వారు క్రొత్త నిబంధనలో రచించినవి 'మార్గము'నకు మన అధికారమై యున్నవి.

సంఘము ఎలా వ్యవస్థీకరింపబడవలెను, ఏమి బోధించవలెను, మరియు దేవుని ఎలా ఆరాధించవలెనో యని నిర్ధారించుటకు, మనము క్రొత్త నిబంధనను అధ్యయనము చేయవలెను. మనము ఈ పని చేసినప్పుడు, ఆది సంఘమును ప్రేరేపింపబడిన అపొస్తలులు నడిపించారని మనము కనుగొందుము. వారి నడిపింపునుబట్టి, సంఘము విలక్షణమైన లక్షణాలు కలిగియుండినది.

*సంఘము ఒక నిశ్చిత వ్యవస్థను కలిగియుండినది.* సభ్యులు స్థానిక కూడికలో భాగమై యుండిరి, మరియు ప్రతి కూడిక స్వయం ప్రతిపత్తిగలదై (స్వపరిపాలనము గలదై) యుండినది. నాయకత్వము పెద్దల చేత సమకూర్చ బడినది; డీకనులు సహితము సంఘములో పరిచారకులై యుండిరి మరియు సువార్తీకులు (ప్రబోధకులు) మరియు ఉపదేశించుచుండిరి.

*సంఘ సభ్యులు ఒక నిశ్చిత విధానములో ఆరాధించారు.* స్థానిక సమావేశములలో, క్రైస్తవులు వారికున్న ఆర్థిక వనరులను అందజేస్తూ ప్రతి వారము మొదటి దినాన ప్రభు రాత్రి భోజన సంస్కారములో పాల్గొనుచుండిరి. వారు కూడియుండినప్పుడు, వారు గానం చేసారు (సంగీత వాయిద్యములు లేకుండా గాయక బృందము పాడుట), ప్రార్థించారు, మరియు దేవుని వాక్యమును అధ్యయనం చేసారు.

*సంఘ సభ్యులు సువార్త ప్రకటించారు మరియు ఉపదేశించారు.* యేసు క్రీస్తు సిలువపై మరణించుట ద్వారా మానవాళిని రక్షించు నిమిత్తము దేవుడు ఆయనను పంపించాడనియు వారు యేసునందు విశ్వసించి, వారి పాపముల గూర్చి పశ్చాత్తాపపడి, వారి విశ్వాసమును ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తమైన బాప్తిస్మము పొందినట్టయితే, ప్రజలు దేవుని కృప చేతనే రక్షింపబడగలరనియు వారు ప్రకటించారు.

ఈ లక్షణములు కలిగియున్న సంఘము తనను తాను దాని శిరస్సు, యేసు క్రీస్తు, సర్వాధికారము కలిగియున్నవాని, యొక్క అధికారమునకు లోబడుచున్నదని అర్థము. ఒక సంఘమునకు ఈ లక్షణములు లేనట్లయితే, సంఘ సభ్యులు సరియైన అవగాహనను సంపాదించుకొనుటకు లేఖనములను అధ్యయనము చేయవలసియుండును.

## తన అనుచరుల జీవితములను పరిపాలించు సర్వాధికారము

ఆయన అనుచరుల జీవితములను పరిపాలించు సర్వహక్కులు యేసునకే చెందియున్నవి. వారు ఒకరితో నొకరు వాదించుకొనునప్పుడు పిల్లలు చెప్పుకొని ఇష్టపూర్వకమైన ఒక నానుడి ఏమనగా, "నీవు నా అధికారివి కాదు!" క్రైస్తవులు యేసు యెడల ఇటువంటి ప్రకటన ఎన్నడును చేయలేరు; దానికి బదులుగా, "నీవే నా అధికారువై యున్నావు! నీవే మా రాజువై యున్నావు!" అని వారు ఇష్టపూర్వకముగా ఒప్పుకొనవలెను. "నీ దాసుడు ఆలకించుచున్నాడు, ఆజ్ఞ ఇమ్ము" అని వెనకటి మనుష్యులు పలికినట్లుగా మనము పలుకువలసి యున్నది (1 సమూయేలు 3:10; KJV).

క్రీస్తు అధికారమును అంగీకరించువాడు యేసు సెలవిచ్చు "కష్టమైన ఉత్తరువులను" – చేయవలెనని చెప్పబడెడు కష్టమైన పనులను – గంభీరముగా పరిగణించును. ఉదాహరణకు యేసు, "... మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" అని చెప్పాడు గనుక (మత్తయి 6:33), క్రైస్తవుడు తన జీవితంలో క్రీస్తుకు ప్రథమ స్థానమునిచ్చుటకు నిజాయితీగా ప్రయాసపడుచుండును. "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్ను తాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను" అని యేసు చెప్పాడు గనుక (మత్తయి 16:24), విశ్వసనీయుడైన క్రైస్తవుడు, వాస్తవంగా, యేసు అతనికి అప్పజెప్పిన బాధ్యతల దృష్ట్యా – "సిలువ" దృష్ట్యా – తన సొంత కోరికలు అప్రధానమైనవని తీవ్రముగా ఆలోచించును. "ఎవడైనను నా యొద్దకు వచ్చి, తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్క చెల్లెండ్రను, తన ప్రాణమును సహా, ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" అని యేసు ఘోషించిన ప్రకటనను బట్టి (లూకా 14:26), క్రైస్తవుడు తన ప్రథమ ప్రాధాన్యతను మరొక పర్యాయము మదింపు చేసికొనును. ఏ సిరిసంపదయైనను ఏ వ్యక్తియైనను అతనికిని అతని ప్రభువునకును మధ్య రాకూడదని నిశ్చయముగా చేసికొనుటకు అతడు తన శాయశక్తులా ప్రయాసపడును. "యేసు సామి నీకే నేను నా సమస్తమిత్తును"[1] అని మనము కొన్ని పర్యాయములు గానముచేయు సంగీతమును అతడు తన దైనందిన జీవితములో ప్రతిబింబించుటకు ప్రయత్నించును. ఈ లక్ష్యమును సాధించుటలో అతడు కొన్ని పర్యాయములు విఫలుడైనప్పటికిని, క్రీస్తు ఇచ్చుచుండు ఆదేశాల మేరకు జీవించునట్లు ప్రయత్నించుట. ఎన్నడు మానివేయడు. అతడు అపొస్తలుడైన పౌలు చెప్పిన ఆదర్శము కొరకు ప్రయాసపడుచుండును: "నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడి యున్నాను. ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు ..." (గలతీయులకు 2:20ఎ).

యేసు క్రీస్తు మాటలను తన హృదయమునకు హత్తుకొనుచు వాటిని నెరవేర్చుటకు ప్రయత్నించు క్రైస్తవుడు ఈ లోకమందు మరియు రాబోవు లోకమందును బహు గొప్ప బహుమానము అందుకొనును. యేసే ఈ క్రింది విధంగా సెలవిచ్చాడు,

> నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచినవాడు. ఇప్పుడు ఇహమందు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను, రాబోవు లోకమందు నిత్యజీవము పొందునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (మార్కు 10:29, 30).

ఈ దీవెనలను అనుభవించవలెనని ఆశించు క్రైస్తవుడవుగా, నీవు చేయవలసినదెల్లా నిన్ను నీవు సంపూర్ణముగా ఆయనకు సమర్పించుకొనునట్లు నీ శాయశక్తులా ప్రయత్నించుటయే!

## క్షమాపణా నిబంధనలు ఆజ్ఞాపించు సర్వాధికారము

చిట్టచివరగా, యేసునకు పాపక్షమాపణా నిబంధనలు, ఒకరు ఆయన రక్తము చేత రక్షింపబడగల నిబంధనలు, ఆజ్ఞాపించు సర్వహక్కులున్నవి. యేసునకు క్రొత్తనిబంధనలో వర్ణింపబడిన రక్షణకును గల సంబంధమేమిటి? ఆయన రక్షకుడై యున్నాడు (లూకా 2:11; యోహాను 4:42; తీతుకు 1:4; 1 యోహాను 4:14); రక్షణ ఆయన ద్వారా మాత్రమే కలుగును (2 తిమోతి 2:10; యోహాను 14:6; అపొస్తలుల కార్యములు 4:12; ఎఫెసీయులకు 1:3 చూడుము). మన పాపములు ఆయన రక్తములో కడుగబడినప్పుడు మనము రక్షింపబడుదుము (మత్తయి 26:28; ప్రకటన 1:5; 7:14). ఆయన తన శరీరమును, అనగా సంఘమును రక్షించును (ఎఫెసీయులకు 5:23, 25). రక్షణను సమకూర్చువాడును అనుగ్రహించువాడును యేసే గనుక, ప్రజలను ఆయన రక్షించు తీరు గూర్చిన నిబంధనలు ఆజ్ఞాపించు సర్వహక్కులు ఆయనకుండవలెను కదా?

క్రీస్తు చేత రక్షింపబడుటకు ఏమి చేయవలెనో తమంతట తామే నిర్ణయించుకొనగలరని అనేకులు అనుకొందురు. “విశ్వాసము చేతనే” రక్షణ కలుగునని కొందరు ప్రతిపాదించారు లేదా ఒకరి హృదయములో “క్రీస్తును అంగీకరించుట”ను లేదా “పాపి ప్రార్థన” చేయుటను కొందరు సమర్థించుదురు. ఇతరలైతే రక్షణ పొందుకొనుటకు ఒకరు చేయగలిగినదేమియూ లేదని స్వాధికారంతో చెప్పుదురు.

ఏదిఏమైనా, పాపమునకు విరుగుడుగా మానవ కల్పితమైన సిద్ధాంతములను అంగీరకించుట అపాయకరము. అది ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుచు వైద్యుని దగ్గర్నుంచి ప్రాణాన్ని కాపాడు ఔషధాలు తెచ్చుకొని, “నేను నా సొంత విధానముల చొప్పున స్వస్థపడగోరుచున్నాను, నీవు చెప్పినట్లు కాదు” అని వైద్యునికి చెప్పుచు, వైద్యుడు వ్రాసి ఇచ్చిన ఆదేశాల మేరకు ఔషధాలను సేవించుటకు నిరాకరించుట వంటిదే ఔతుంది.

రక్షణ పొందుటకు విశ్వాసము మరియు విధేయత అవశ్యకమని యేసు తానే ఉపదేశించాడు, ఆయన అపొస్తలులను ప్రేరేపించి ప్రజలు రక్షణ నందుకొను విధానమును వారి ద్వారా తెలియజేయుచు రక్షణ మార్గమును ఆయన సరాళము చేసాడు. అనగా, క్షమాపణా నిబంధనల గూర్చి అపొస్తలులు అందించిన ఉపదేశములు యేసు క్రీస్తు నుండి వారు పొందుకొన్నవేనని మరో మాటలో చెప్పుకొనవచ్చును. క్రొత్త నిబంధనలోగల క్షమాపణా ప్రణాళిక యేసు క్రీస్తు ఆజ్ఞాపించినదే. అందులో ఏమి చేర్చబడియున్నది?

వారు రక్షింపబడునట్లు క్రొత్త నిబంధనలోని ప్రజలు ఈ ఆజ్ఞలను అనుసరించారు. వారు యేసే క్రీస్తని, సజీవుడైన దేవుని కుమారుడని ఆయన యందు విశ్వసించారు (యోహాను 3:16; అపొస్తలుల కార్యములు 16:31; రోమీయులకు 5:1; గలతీయులకు 3:26, 27). వారి పాపముల గూర్చి వారు పశ్చాత్తాపపడ్డారు (లూకా 13:3, 5; అపొస్తలుల కార్యములు 2:38). వారు యేసు క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొన్నారు (రోమీయులకు 10:9, 10; మత్తయి 10:32, 33; 16:16–19; అపొస్తలుల కార్యములు 8:37 చూడుము). వారు పాపక్షమాపణ కొరకైన బాప్తిస్మము పొందినారు (నీటిలో ముంచబడినారు) (అపొస్తలుల కార్యములు 2:38;

22:16; రోమీయులకు 6:3, 4; కొలొస్సయులకు 2:12; 1 పేతురు 3:20, 21).

"ఈ క్షమాపణ నిబంధనల గూర్చి నీవేమనుకొనుచున్నావు?" "నీవు వీటితో ఏకీభవిస్తావా?" ఇటువంటి ప్రశ్నలడుగుట అర్థరహితమైన అంశమే. ఆయన తన కనికరము చొప్పున ఉచితముగా సమకూర్చు రక్షణను మనము పొందునట్లు నెరవేర్చవలసిన విషయాలను నిర్ధారించుటకు యేసునకు సర్వాధికారమున్నది, మరియు ఆయన కోరుచున్న విషయాలను ప్రశ్నించుటకు మనకు ఎటువంటి హక్కైనను లేదు. ఆయన కోరుచున్న విషయాలను మనము ఇష్టపడినా ఇష్టపడకపోయినా ఏకీభవించినా ఏకీభవించకపోయినా పట్టించుకొనదగిన విషయము కాదు. మనము కేవలము లోబడవలసినవారమై యున్నాము, ఆయన చిత్తమునకు అప్పగించుకొనవలసినవారమై యున్నాము! ఇలా జరిగినప్పుడు, ఆయన మనలను క్షమించి మనకు రక్షణననుగ్రహించునను కచ్చితమైన అభయము కలుగును.

## ముగింపు

యేసు క్రీస్తు ప్రేమామయుడనీ, స్వస్థపర్చుటకు జాలి గుండెలు గలవాడనీ దాదాపుగా ప్రతి ఒక్కరు అంగీకరిస్తారు. ఆయన వ్యభిచారములో పట్టబడిన స్త్రీకి మరియు సిలువ మీద నుండిన దొంగకు కృపాసహితమైన రక్షకుడని పరిశుద్ధ బైబిలును చదువువారు ఆయనను ప్రేమిస్తారు. ఏది ఏమైనా, 'మార్గము'లో (మతములో) యేసు మన అధికారిగా – మన ప్రభువుగా, మన ఆత్మలను రక్షించునట్లు మనము ఆయనకు లోబడుచుండవలెనని కోరుచుండు మన "యజమాని"గా – ఉండుటను ప్రజలు ఇష్టపడుటలేదు!

యేసు క్రీస్తును నీ అధికారిగా అంగీకరించుటకు నీవు ఇష్టపడుచున్నావా? ఆయన "ప్రభువు" అని నీవు ఆయనను సంబోధించుచున్నావా? యేసు క్రీస్తు యొక్క అధికారమునకు సంబంధించినంత వరకు, నీవు అనుకొనుచున్నది, నమ్ముచున్నది, లేక చెప్పుచున్నది ఏమిటి అనునది ప్రశ్న కాదు; అసలు ప్రశ్న ఏమనగా: "నీవు ఆయనకు లోబడుచున్నావా?"

---

సూచన

[1]Judson W. Van DeVenter, "All to Jesus I Surrender," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).